# నినాదం
## తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం

గురువారం 26 జూన్ 2025




# చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానం

- **ప్రైవేట్ కంటే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య.**
- **పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ**
- **పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం, జూన్25(నినాదం న్యూస్):** చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానం సాధించవచ్చని, ప్రైవేట్ కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బుధవారం చింతకాని మండలం వందనం గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. కలెక్టర్ స్కూల్ పరిసరాలు, పిల్లల టాయిలెట్స్, వంటగది, పాఠశాల నందు తరగతి గదులు తిరుగుతూ, విద్యా బోధన ప్రక్రియను పరిశీలించారు. పాఠశాలలో మొదటి తరగతి, ఐదవ తరగతి క్లాస్ రూం లోకి వెళ్లి ఉపాధ్యాయురాలు ఇంగ్లీష్ బోధిస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థులతో కలెక్టర్ ఇంగ్లీష్ లో మాట్లాడారు. పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు వచ్చాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కొత్త వర్క్ బుక్స్ లను కలెక్టర్ పంపిణీ చేశారు. నాణ్యమైన విద్యా బోధనతో పాటు విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాల సాధన దిశగా విద్యార్థులు ఇప్పటి నుంచే కృషి చేయాలని అన్నారు. విద్యార్థులు వారి ఆరోగ్యం, ఎదుగుదల పట్ల కూడా శ్రద్ధ వహించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ అందిస్తున్నామని తెలిపారు. విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందని, తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని తమ పిల్లలు బాగా చదవాలని పాఠశాలలకు పంపుతుంటారని, విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా బాగా చదివి ఉన్నత శిఖరాలను అవరోధించాలన్నారు . కష్టపడి చదివే విద్యతోనే భవిష్యత్తులో గొప్ప ఉద్యోగాలు సాధించుకోవచ్చు అని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పిల్లలకు వడ్డించే మధ్యాహ్న భోజనం అన్నం, కూరలు, కోడిగుడ్డు నాణ్యతను పరిశీలించారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్. సత్యనారాయణ, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

# వరద విపత్తులను ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలి

- **పునరావాస కేంద్రాలను సమీప ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి**
- **నీటి వనరుల స్థితిగతులను నిరంతరం పర్యవేక్షించాలి.**
- **జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో విపత్తుల నిర్వహణపై సమీక్షించిన జిల్లా కలెక్టర్**



**ఖమ్మం, జూన్ 25(నినాదం న్యూస్):** వరద విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ లతో కలిసి విపత్తుల నిర్వహణపై జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గతంలో ముంపునకు గురైన ప్రతి హ్యాబిటేషన్ ఇంటిలో ప్రజలను మరోసారి వరదలు వస్తే ఎక్కడికి తరలిస్తామనే మైక్రో లెవల్ ప్లానింగ్ సిద్ధం చేసుకోవాలని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా సమీపంలో రిహాబిలిటేషన్ సెంటర్ లను గుర్తించి, అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని, పునరావాస కేంద్రాల సమాచారం ముందుగానే వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అందించాలని, వరద రాగానే ఆ కేంద్రాలకు వెళ్లేలా ప్రజలను సిద్ధం చేయాలని అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లో 24 గంటల పాటు పని చేసే కంట్రోల్ రూమ్ వెంటనే ఏర్పాటు చేయాలని, ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదు నమోదు చేసుకొని సత్వరమే పరిష్కరించేలా వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. వరదల గురించి ముందుగానే మనకు సమాచారం అందేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో ఉన్న నీటి వనరులను నిరంతరం మానిటరింగ్ చేయాలని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో, నీటి వనరులకు సమీప ప్రాంతాల్లో అవసరమైన బోట్లు, రోప్స్, లైఫ్ జాకెట్, మైక్స్, లైట్లు అందుబాటులో ఉంచాలని, గజ ఈతగాళ్ళ ను పంపే విధంగా జాబితా సిద్ధం చేసి పెట్టుకోవాలని అన్నారు. 300 మంది ఆపద మిత్రల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా ప్రణాళిక తయారు చేయాలని, విపత్తుల నిర్వహణ కోసం ఎన్.డి.ఆర్.ఎఫ్. బృందాలను స్థానికంగా అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాల నిర్వహణ, అక్కడ ప్రజలకు అవసరమైన ఆహార సరఫరా, మెడికల్ క్యాంపు ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణకు మున్సిపల్, స్థానిక సంస్థల ద్వారా ప్లానింగ్ చేయాలని అన్నారు.ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్, జిల్లాలో ఉన్న మున్సిపాల్టీలలో వాటర్ లాగింగ్ లేకుండా అవసరమైన మరమ్మత్తు పనులు వెంటనే పూర్తి చేయాలని అన్నారు. వరదల సమయంలో క్షేత్రస్థాయి పరిస్థితుల సమాచారం అధికారుల నుంచి వెంటనే తనకు అందాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీస్ కమీషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ముందు జాగ్రత్త చర్యలు చాలా అవసరమని అన్నారు. లో తట్టు ప్రాంతాల స్థానిక నాయకులతో సమన్వయంతో ఉండాలని, ప్రజలలో అనవసర ఆందోళన సృష్టించవద్దని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను సమీప ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని, లోతట్టు ప్రాంతాల్లోని రోడ్డు గుంతలు పూడ్చివేయాలని అన్నారు.అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ జిల్లాలో పునరావాస కేంద్రాలలో ప్రజలను తరలించినప్పుడు వారికి అవసరమైన ఏర్పాట్లు కల్పించాలని అన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలకు ముందస్తుగా జిప్ కవర్లు పంపిణీ చేయాలని, ముఖ్యమైన పత్రాలు, ఆభరణాలు వాటిలో భద్రపర్చుకొనేటట్లు తెలియజేయాలని అన్నారు. ప్రతి మండలంలో గజ ఈతగాళ్ళ జాబితా సిద్ధం చేసి పెట్టుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీలు, తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం పరిమళించిన వేళ

- **ఆపదలో ఉన్న మహిళను ఆదుకున్న స్ఫూర్తిదాత**



**మనుగూరు, నినాదం న్యూస్):** మానవత్వం పరిమళించిన వేళ ఆపదలో ఉన్న మహిళను నేనున్నానంటూ ఆదుకుని వారికి భరోసాగా నిలబడ్డ స్ఫూర్తిదాత కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు గురజాల గోపి సహాయం వైయస్సార్ నగర్ ప్రాంత వాసులను హృదయాన్ని కదిలించింది. వివరాల్లోకెళ్తే ఇలా ఉన్నాయి మణుగూరు మండలంలో వైయస్సార్ నగర్ గ్రామానికి చెందిన ఎం రాములమ్మ (40) అనే మహిళ గర్భసంచిలో కనితి రావడంతో కొంతకాలంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంది. వాస్తవంగా వాళ్ల కుటుంబం పేదరికంలో జీవనం కొనసాగిస్తున్నారు. వాళ్ల కుటుంబం రికార్డుదే గాని డొక్కాడే పరిస్థితి , ఎదురీంకంలో మగ్గుతూ వైద్య సేవలకు ఆర్థికంగా లేకపోవడంతో ఆమె ఆరోగ్యం పరిస్థితి రోజురోజుకీ ఆందోళనకరంగా మారిపోయింది. దీంతో వాళ్ళ కుటుంబం దీనంగా మారిపోయింది. కుటుంబంలో పెద్ద దిక్కుగా ఉన్న ఆమె మంచానికే పరిమితమైపిల్లలు భర్త వారి కుటుంబం మొత్తం శోభసముద్రంలో మునిగిపోయారు. అదే వైఎస్ఆర్ నగర్ కి చెందినసీనియర్ మహిళా నాయకురాలు ఎండి షబానా విషయాన్ని తెలుసుకొని వెంటనే ఆమెకి భరోసా కల్పించింది. విషయాన్ని సీనియర్ కాంగ్రెస్ నాయకులు గురజాల గోపి దృష్టికి తీసుకొని వెళ్లగా, ఆయన మానవత్వంతో స్పందించి వారి కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసాఇవ్వడం జరిగింది. వెంటనే గురజాల గోపి తన సొంత వాహనం ద్వారా కొత్తగూడెం లో ప్రముఖ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ శంకర్ నాయక్ తో మాట్లాడి ఉచితంగా ఆమెకుగర్భసంచి ఆపరేషన్ చేయించి కనితి గడ్డలను తీసివేసి ఆమెను పూర్తిస్థాయిలో ఆదుకున్నారు. ఇదే విషయాన్ని గురజాల గోపి కేంద్ర మాజీమంత్రి ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరికి సమాచారం ఇవ్వగా ఆమె కూడా వెంటనే స్పందించి పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించాలని గురిజాల గోపిని ఆదేశించింది. ప్రస్తుతం రాములమ్మ పరిస్థితి నిలకడగా ఉన్నట్లు డాక్టర్ శంకర్ నాయక్ తెలియజేశారు. ఈ కార్యక్ర మంలో మహిళా కాంగ్రెస్ రేణుక చౌదరి కార్యాల యంలో మహిళలు తన వంతు కర్తవ్యం గాఆపదలో ఉన్న మహిళను ఆదుకొని ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. రాములమ్మ కుటుంబాన్ని ఉచితంగా వైద్య సేవలు చేపించిన గురిజాల గోపి వారి కుటుంబాన్ని కూడా ఆర్థికంగా ఆదుకొని కొన్నంత ధైర్యాన్ని ఇవ్వడం జరిగింది. ఈ సంఘటన వైయస్సార్ నగర్ లో ప్రజలు హర్షాభిరేఖలు ప్రకటించారు. ఆపదలో ఉన్న మనిషిని ఆదుకోవడం మనిషి ఉదార స్వభావానికి నాంది పలుకుతుందని వైయస్సార్ కాలనీవాసులు ముక్తకండంతో కృతజ్ఞతలు తెలిపారు.

## టిబి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి..
**- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజ**



**ఖమ్మం, జూన్25(నినాదం న్యూస్):** టిబి రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. టిబి ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా బుధవారం ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని ఒకటో డివిజన్ కైకొండాయిగూడెం లో ఖమ్మం గ్రానైట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత మెగా హెల్త్ క్యాంపు ను అదనపు కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, భారత ప్రభుత్వం 2025 నాటికి దేశాన్ని టి.బి. రహితంగా మార్చాలనే లక్ష్యంతో "టి.బి. ముక్త్ భారత్ అభియాన్" ప్రారంభించిందన్నారు. ఈ అభియాన్‌లో భాగంగా ప్రతి టి.బి. బాధితుడిని గుర్తించి, వారికి సరైన వైద్యం, పోషకాహారం, మద్దతు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.ప్రభుత్వం టి.బి. రోగుల కోసం "నిక్షయ్ పోషణ యోజన" పేరిట నెలకు 500 రూపాయల పోషకాహార భత్యాన్ని అందిస్తోందని, అలాగే అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. "నిక్షయ్ పోర్టల్" ద్వారా టి.బి. రోగుల రిజిస్ట్రేషన్, ఫాలో అప్ నిర్వహించబడుతోందని అదనపు కలెక్టర్ తెలిపారు.టి.బి. వ్యాధి నివారణకు సమాజం కూడా భాగస్వామ్యం కావాలని, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే పరీక్ష చేయించుకోవాలని అదనపు కలెక్టర్ అన్నారు. టి.బి. బాధితులను వివక్షతో చూడకూడదని, వారి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో మద్దతు ఇవ్వాలని, వారు మందులు పూర్తిగా తీసుకునేలా చేయడం అత్యంత అవసరమని అన్నారు. టి.బి. పూర్తిగా నయమయ్యే వ్యాధని, దీనికి సరైన సమయంలో గుర్తింపు, నిరంతర వైద్యం అవసరమని, మనం ప్రతి ఒక్కరం జాగ్రత్తగా ఉండటం ద్వారా టి.బి. వ్యాధిని నివారించగలమని అదనపు కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. బి. కళావతి బాయి, గ్రానైట్ అసోసియేషన్ బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.


# జులై 9 దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి

- **సీఐటీయూ (ఏఆర్‌టీడబ్ల్యూఎఫ్) జిల్లా అధ్యక్షుడువై విక్రం పిలుపు**



**ఖమ్మం,జూన్ 25(నినాదం న్యూస్ ):** జూలై 09 న జరిగే జాతీయ కార్మిక సమ్మెలో ట్రాన్స్ పోర్ట్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని అల్ ఇండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (%ూ×=ఔఖీ- జ×ఖ%) జూలై 09 సమ్మె జయప్రదం చేయాలని ,లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన నుండి కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్పొరేట్ అనుకూల విధానాలు అమలుచేస్తున్నదని విమర్శించారు.29 కార్మిక చట్టాలను రద్దు చేసి మోడీ కార్మిక వ్యతిరేక విధానాలు అమలుచేస్తున్నాడని ,కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని సిఐటియుతో పాటు జాతీయ కార్మిక సంఘాలు , స్వతంత్ర ఫెడరేషన్ లు ,రాష్ట్ర వ్యాపిత కార్మిక సంఘాలు జూలై 09 జాతీయ సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని ఈ సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.10 సంవత్సరాలు జైలు శిక్ష , ఏడు లక్షల జరిమానా ట్రాన్స్ పోర్ట్ డ్రైవర్లకు కఠినంగా శిక్ష విధించే భారత న్యాయ సంహిత సెక్షన్ 106(1)(2) ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.డ్రైవర్ ల లైసెన్స్ లు , వాహన రిజిస్ట్రేషన్ లను సైతం నూతన మోటార్ వాహన చట్టం -2019 ప్రకారం ప్రైవేట్ ఏజెన్సీ లకు ఇస్తారని ,అధిక ఫైన్ లు వేస్తారని డ్రైవర్ లకు నష్టం చేసే ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ చట్టం రద్దు అయ్యేవరకు జరగబోయే పోరాటాలకు కార్మికులు సిద్ధంగా ఉండాలని జూలై 09 సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ పోర్ట్ యూనియన్ ( సిఐటియు- ఏ ఆర్ టి డబ్ల్యూ) జిల్లా కార్యదర్శి జిల్లా ఉపేందర్, జిల్లా ఉపాధ్యక్షులు ధరావత్ రాందాస్, ట్రాక్టర్ యూనియన్ జిల్లా అధ్యక్షులు గుర్రం సతీష్, ఆటో యూనియన్ జిల్లా నాయకులు ఎస్కే కాసిం యూనియన్ నాయకులు నరసయ్య లక్ష్మణ్ వెంకటేశ్వర్లు, రాంబాబు, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు .

## భవిష్యత్ అవసరాల మేరకు రహదారుల విస్తరణ : కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి



**శేరిలింగంపల్లి, ప్రతినిధి, (నినాదం న్యూస్) :** ప్రజా అవసరాలు, భవిష్యత్ తరాల కోసం రహదారుల విస్తరణ చేపట్టనున్నట్లు కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చందానగర్ డివిజన్ పరిధిలోని శ్రీదేవి థియేటర్ నుండి అమీన్‌పూర్ వరకు రూ.45 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న రహదారి విస్తరణ పనులకు నేడు మధ్యాహ్నం 3 గంటలకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, స్థానిక ఎమ్మెల్యే అరికెపుడి గాంధీతో కలిసి ఈ శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ రహదారి విస్తరణ పనులు పూర్తయితే చందానగర్ డివిజన్ ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తగ్గి, ప్రయాణం మరింత సులభతరం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాలనీ వాసులకు రహదారి కష్టాలు తొలగిపోతాయని ఆమె పేర్కొన్నారు

# రక్షకులకు రక్షణ కరువు

**మల్లాపూర్, జూన్ 25 (నినాదం న్యూస్) :** పోలీస్ ఆ పేరు వింటేనే నేరస్తుల గుండెల్లో రైళ్లు పరుగెట్టేవి. తప్పు చేయని వారు కూడా పోలీసుని చూస్తే టెన్షన్ పడే పరిస్థితులు ఉండేవి. కాలం మారింది. తప్పు చేసినా పోలీసులకు భయపడకపోగా వారిపైనే ఎదురుదాడులకు దిగుతున్నారు కొందరు. రక్షకులకే రక్షణ కరువైన ఘటన మల్లాపూర్ మండల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ నెల 22 ఆదివారం రాత్రి రాఘవ పేట గ్రామ శివారులోని వైకుంఠ ధామం వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా ఖానాపూర్ కి చెందిన బుర్ర ప్రవీణ్ కుమార్, సింగు కళ్యాణ్ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ పై దుర్భాషలాడుతూ, దాడికి పాల్పడ్డారని, ప్రభుత్వ వస్తువులని ధ్వంసం చేశారని సమాచారం. గాయపడిన కానిస్టేబుల్ ని ఆసుపత్రికి తరలించి నట్టు. కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్ కి తరలించినట్లు సమాచారం.

# ఈత చెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి గాయాలు



**మల్లాపూర్, జూన్ 25 (నినాదం న్యూస్) :** ఈత చెట్టు పైనుంచి పడి గీతకార్మికుడికి గాయాలైన ఘటన మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టాపూర్ గ్రామానికి చెందిన దికొండ శ్రీధర్ గౌడ్ ( 39) సోమవారం సాయంత్రం కల్లు గీస్తుండగా ఈత చెట్టు పై నుండి పడి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు మెట్‌పల్లి లోని ఆసుపత్రి కి చేర్పించినగా చికిత్స పొంధుతున్నాడు . లేవలేని స్థితిలో వున్న దికొండ శ్రీధర్ ని ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబీకులు, స్థానికులు కోరుతున్నారు.

## మృతి చెందిన గౌడన్న కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి
**- గౌడ సంఘం నాయకుడు పచ్చిమట్ల రవీందర్ గౌడ్**



**భీమదేవరపల్లి జూన్ 25 (నినాదం న్యూస్):** హుస్నాబాద్ నియోజకవర్గంలోని భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామానికి చెందిన కొక్కిస రాజు గత ఆరు నెలల క్రితం తాడి చెట్టు మీద నుండి ప్రమాదవశత్తు కింద పడి చనిపోవడం జరిగింది . ఇప్పటికీ ఐదు లక్షల రూపాయల ఎక్స్ గ్రేసియో వారి కుటుంబానికి రాలేదు. హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలో దాదాపు తాటి చెట్టు మీద నుండి నలుగురు కింద పడి చనిపోవడం జరిగింది. అదేవిధంగా 20 మంది కల్లుగీత కార్మికులు వికలాంగులుగా, గాయాలతో ఆసుపత్రిలో చికిత్స చేసుకున్నారు. బిల్లులు రాక వారి యొక్క కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం పక్షాన వెంటనే వారికి నష్టపరిహారం ఇవ్వాలని హుస్నాబాద్ ఎమ్మెల్యే మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ని కోరడం జరుగుతుంది. అదేవిధంగా అర్హులైన కల్లుగీత కార్మికులకు కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయడం జరుగుతుంది. కార్యక్రమంలో తెలంగాణ కలుగీతా కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పచ్చిమట్ల రవీందర్ గౌడ్, కాసగోని సంపత్ గౌడ్, మృతుడి భార్య పిల్లలు ఉన్నారు.

## పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె



**దమ్మపేట, జూన్ 26(నినాదం న్యూస్):** మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలో బైబిల్ మిషన్ చర్చ్ ప్రార్థనా మందిరంలో జరిగిన ఫాస్టర్స్ ఫెలోషిప్ సమావేశంలో సంఘస్తుల ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు జారె ఆదినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన ఫెలోషిప్ సమావేశంలో క్రైస్తవుల ఐక్యత ఆధ్యాత్మిక సేవల ప్రాధాన్యత గురించి ప్రసంగించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ తన ద్వారా చక్కని సందేశాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మాజీ ఎంపీపీ సోయం ప్రసాద్, పర్వతనేని ప్రసాద్, చిన్నశెట్టి యుగంధర్, పగడాల రాంబాబు, చిన్నశెట్టి చిట్టిబాబు, మాజీ సర్పంచ్ మడకం రాజేష్, బాల స్వామి, ఫాస్టర్స్ సంఘం అధ్యక్షులు, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# బైక్‌తో చెట్టుకు ఢీ కొని యువకుడు మృతి

**చింతపల్లి, జూన్ 25 (నినాదం న్యూస్) :** ఒక యువకుడు బైక్ పై చెట్టుకు ఢీ కొన్న సంఘటనలో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం మండల పరిధిలోని అనాజీ పురం గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్ ఐ రామూర్తి తెలిపిన వివరాల ప్రకార, దేవరకొండ మండలం ఎల్లారెడ్డి బావి గ్రామానికి చెందిన చీకుమెట్ల అభి( 23)హైదరాబాద్ లో హెయిర్ కటింగ్ షాపులో కుల వృత్తి చేసే వాడు. ఈ తరుణంలోనే బుధవారం రాత్రి విధులు ముగించుకొని తన మోటార్ సైకిల్ పై స్వగ్రామానికి వెళ్తుండగా అనాజీ పురం గ్రామ సమీపంలో మూల మలుపు వద్ద అతి వేగంతో వచ్చి చెట్టును డీ కొనడంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తెల్లవారుజామున అటు వైపు వెళ్లతున్న వాహన దారులు పోలీస్ లకు సమాచారం అందించడంతో పోలీస్ లు ఘటన స్థలానికి చేరుకొని మృతుని వివరాలు సేకరించి మృత దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు.. సంఘటన స్థలాన్ని సందర్శించిన నాంపల్లి సిఐ రాజు ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. మద్యం మత్తు, అతివేగం తోనే ప్రమాదం చోటుచేసుకున్నట్టు తెలిపారు. ఈ విషయం పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్టు ఎస్ ఐ తెలిపారు..

## యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి : సీఐ రాం నర్సింహా రెడ్డి



**వెల్గటూర్, జూన్25(నినాదం న్యూస్):** యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని,ఉన్నత చదువులు చదివి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ధర్మపురి సిఐ రాం నర్సింహా రెడ్డి విద్యార్థులకు సూచించారు.జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం,అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా స్తంభం పల్లి లోని మహాత్మా గాంధీ జ్యోతి రావ్ పూలే పాఠశాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో సిఐ రాం నర్సింహ రెడ్డి మాట్లాడుతూ.. యువత మత్తు ముసుగులో పోకుండా విద్యను క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరి తల్లిదండ్రులకు,చదువు చెప్పిన గురువులకు గొప్ప పేరు తీసుకు రావాలని కోరారు.ఎలాంటి చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా యువత కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు.కార్యక్రమంలో ఇంచార్జ్ ఎస్సై శ్రీధర్ రెడ్డి, ప్రోహిబిషన్ ఎస్సై. సతీష్,పాటశాల ప్రిన్సిపల్ హరిత,పోలీస్ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.